## పోలింగ్ బూత్‌లలో

# సదుపాయాలు పరిశీలించాలి

### జుక్కల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మను చౌదరి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మను చౌదరి

నిజాంసాగర్, అక్టోబర్ 10: రాష్ట్రంలో నవంబర్ 30వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పోలింగ్ బూత్‌లలో విద్యుత్, వాష్ రూమ్‌ల వంటి సదుపాయాలు సరిగా ఉన్నాయా లేదా పరిశీలించాలని జుక్కల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ మనుచౌదరి అన్నారు. నిజాంసాగర్ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో జుక్కల్ నియోజక వర్గంలోని ఆయా మండలాల సెక్టోరియల్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటి మరమ్మతులు చేయించాలని సూచించారు. కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ ఆస్తులపై ఎలాంటి పోస్టర్లు ఉండకుండా చూడాలని, వాటితోపాటు గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలు, ఫ్లెక్సీలను ఉంచకుండా చూసుకోవాలని కోరారు. 80 సంవత్సరాలు పైబడిన వారితోపాటు దివ్యాంగులు, ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని సెక్టోరియల్ అధికారులు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏవోలు, పీఆర్ ఏఈలు, ఏంఈవోలు, ఇరిగేషన్, మిషన్ భగీరథ ఏఈలు పాల్గొన్నారు.



పాల్గొన్న సెక్టోరియల్ అధికారులు

## విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



అల్పాహారం వడ్డిస్తున్న హెచ్ఎం నారాయణ

పిట్లం, అక్టోబర్ 10: మండలకేంద్రంలోని బోయివాడ పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకంలో భాగంగా మెనూ ప్రకారం మంగళవారం టమాటా రైస్‌ను ప్రధానోపాధ్యాయుడు నారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార పథకంలో భాగంగా విద్యార్థులకు ప్రతి రోజూ మెనూ ప్రకారం బ్రేక్ ఫాస్ట్‌ను అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు

ఎల్లారెడ్డి, అక్టోబర్ 10: ఎన్నికల నేపథ్యంలో ఎల్లారెడ్డి నియోజక వర్గంలో ప్రత్యేకంగా రెండు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామం సమీపంలో మెదక్ శివారులో ఒకటి, నిజామాబాద్ జిల్లా సరిహద్దు సదాశివనగర్ మండలం దగ్గి గ్రామం వద్ద మరో చెక్ పోస్టును ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి చెక్ పోస్టు వద్ద ఒక ఏఎస్సై స్థాయి అధికారితో పాటు నలుగురు కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోకి ఇతర ప్రాంతాల నుంచి మద్యంతోపాటు నగదు అక్రమంగా తరలించకుండా తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు చెక్‌పోస్టులు పని చేస్తాయని వివరించారు.



నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

### రైతుల కల్లాల వద్ద

## హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

తాడ్వాయి, అక్టోబర్ 10: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఉన్న రైతుల కల్లంలో హైమాస్ట్ లైట్లను మంగళవారం ఏర్పాటు చేసినట్లు ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రామ సమీపంలో రైతులు పండించిన వరి, మక్కజొన్న దిగుబడులను ఆరబెట్టుకునేందుకు కేటాయించిన స్థలంలో ఎంపీటీసీ నిధులతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశామని చెప్పారు. లైట్ల ఏర్పాటుతో రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ హైమద్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజిరెడ్డి, రైతులు రమేశ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లు



## దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ



వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్ట్ సారిక

గాంధారి, అక్టోబర్ 10: గాంధారి భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపిస్ట్ సారిక ఆధ్వర్యంలో మంగళవారం వ్యాయామం చేయించారు. ప్రతి వారం నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరానికి దివ్యాంగులను తప్పకుండా తీసుకురావాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. దివ్యాంగులతో ఇంటి వద్ద చేయించాల్సిన వ్యాయామాలను తల్లిదండ్రులకు వివరించారు. శిబిరంలో రిసోర్సు టీచర్లు పెంటన్న, సాయన్న, దివ్యాంగ చిన్నారుల కుటుంబీకులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలి



మీసాన్‌పల్లిలో గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీవో ప్రకాశ్



పిట్లంలో ఫ్లెక్సీని తొలగిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 10: రాష్ట్రంలో సోమవారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున గ్రామాల్లో ఎక్కడా ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు, వాల్ పెయింటింగ్‌లను ఉంచకూడదని ఎంపీవో ప్రకాశ్ సూచించారు. వాటిని తక్షణమే తొలగించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని మీసాన్‌పల్లి గ్రామ పంచాయతీని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రారంభమైనందున ఏ పార్టీలకు సంబంధించిన గుర్తులు, ప్రచార సామగ్రి కనిపించకూడదని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయనతోపాటు పంచాయతీ కార్యదర్శి సంతోష్ తదితరులు ఉన్నారు.

**ఫ్లెక్సీల తొలగింపు..**

పిట్లం, అక్టోబర్ 10: పిట్లంలో ఏర్పాటుచేసిన పలు పార్టీల ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. పంచాయతీ కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగిస్తున్నట్లు తెలిపారు.

### అధ్యాపక పోస్టుకు

## దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్, అక్టోబర్ 10: మర్కల్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలో కామర్స్ బోధించడానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు కాలేజీలో బుధవారం నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి సర్టిఫికెట్లతో ఉదయం పది గంటల వరకు కాలేజీకి రావాలని సూచించారు.

## రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన

పిట్లం, అక్టోబర్ 10: మండలంలోని రాంపూర్ గ్రామంలో రేషన్ డీలర్ లబ్ధిదారులకు రేషన్ సరుకులను సకాలంలో ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆరోపిస్తూ పిట్లం – బాన్సువాడ రహదారిపై మంగళవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఆందోళనతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. దీంతో అధికారులు అక్కడికి చేరుకొని లబ్ధిదారులతో మాట్లాడారు. రేషన్ సరుకులు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో వారు ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న రాంపూర్ గ్రామస్తులు

## బెల్టు షాపుపై దాడి : రూ.40వేల విలువైన మద్యం స్వాధీనం

తాడ్వాయి, అక్టోబర్ 10: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో బెల్టుషాపుపై మంగళవారం ఉదయం దాడి చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా రూ.40వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న కిష్టాగౌడ్ ఇంటిపై దాడి చేయగా.. 165 బీర్లు, 15 లీటర్ల మద్యం బాటిళ్లు లభించామని అన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని కిష్టాగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.



మద్యం స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు